# రక్షణ

## నందుల సుశీలాదేవి

స్కూటర్ రివ్వున వచ్చి పక్కన ఆగింది.

ఉలిక్కిపడింది పద్మ.

రాజేష్ కంఠం తీవ్రంగా పలికింది.

"ఎన్నిసార్లు అగడను? నన్ను ప్రేమిస్తున్నావా లేదా?"

పద్మ కంగారుగా చుట్టూ చూసింది.

ఎవరి మానాన వాళ్ళు వెళ్ళిపోతున్నారు కాని నడి రోడ్డుమీద ఓ ఆడ పిల్లను వేధించే మగవాడిని ప్రశ్నించే వారు లేరు.

పద్మ వేడికోలుగా అంది.

"ప్లీజ్! నన్ను అల్లరి పెట్టకండి. నాకు యింకో నెలరోజుల్లో పరీక్షలు వున్నాయి. నన్ను చదువుకోనివ్వండి".

రాజేష్ వెటకారంగా నవ్వేడు.

"ఓ బియ్యే పాసయితే వో నాల్గయిదు వేలు సంపాదిస్తావు. నువ్వు అవునంటే నిన్ను పట్టు తివాచీల మీద నడిపిస్తాను. నాకు నీ మీద మనసయింది. లక్షలు కట్నాలతో మా యింటి చుట్టూ తిరుగుతున్నారు. తెలుసా?"

పద్మ కళ్ల వెంట నీరు సుడులు తిరిగింది.

గబగబా నడవ సాగింది.

రాజేష్ క్రూరంగా అన్నాడు.

"ఏయ్! పద్మా! వచ్చే సోమవారం నాటికి నీ అంగీకారం నాకు కావాలి. కావాలంటే ఆ పరీక్షలేవో రాసుకో! కాని నన్ను ప్రేమిస్తున్నానని చెప్పి తీరాలి. లేదా! పేపర్లలో చూస్తున్నావుగా! నీ చక్కటి మొహం యాసిడ్‌తో మాడి మసిబొగ్గులవుతుంది. నేను పోస్తాననుకున్నావా? ఎవరో కిరాయి గాడి చేత పోయిస్తాను. రుజువులూ సాక్ష్యాలూ దొరక్కుండా చూసుకుంటాను. నాకు దక్కనిది యింకెవరికీ దక్కకూడదు. ఆలోచించుకో".

పద్మ గుండెలు దడదడలాడేయి.

ఎట్లాగో కాలేజీకి వెళ్ళింది.

పాఠాలు వినలేక పోయింది.

రివిజన్ క్లాసు – తాను చదివినవే అన్నీ!

ఏదో మొక్కుబడిగా క్లాసులో పాఠాలు వింది.

ఈ రాజేష్ మూడు నెలల నుండి తనను వేధిస్తున్నాడు.

అమ్మతో చెప్పింది.

అమ్మ మాత్రం ఏం చేయగలదు?

"నీ జాగ్రత్తలో నువ్వుండమ్మా" అంది.

ఆరు నెలల క్రిందట తండ్రిపోయాడు.

ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరు గారింట్లో పెరటిలో ఓ గదీ వసారా వుంది. ఇంటి గలాయిన క్యాంపులకు వెళ్ళినప్పుడు సాయంగా వుంటారనీ, తమది చిన్న కుటుంబమనీ తమకు అద్దెకు యిచ్చారు.

తండ్రిపోయిన తర్వాత ఆ ఇంటి గలవాళ్ళు తమని అద్దె అడగటం లేదు.

అమ్మ వాళ్ళ ఇంట్లో పనికి సాయం అందిస్తుంది.

తను వాళ్ళ పిల్లల హోంవర్కు చేయించి వాళ్ళ చదువులను కనిపెట్టి వుంటుంది.

నాన్నపోయేక వచ్చిన డబ్బుతోనూ, అమ్మకు వచ్చే పెన్షన్‌తోనూ గుట్టుగా రోజులు గడుపుకొని వస్తున్నాం.

తమ పరీక్షలయ్యాక దరఖాస్తు చేసుకుంటే నాన్న ఆఫీసులో తనకు ఉద్యోగం వస్తుంది.

తండ్రి అనారోగ్యానికి చాలా అప్పులయ్యాయి.

తన ఉద్యోగం తనకు ప్రాణాధారం. డిగ్రీ పరీక్షలు కాగానే తనకు ఉద్యోగం వచ్చేస్తుంది.

అంతవరకూ రోజులు అతికష్టం మీద నెట్టుకుని రావాలి.

ఈ రాజేష్ ఎవరో కూడా తనకి తెలియదు. ఒక రోజు తన పక్కనే స్కూటర్ ఆపి అన్నాడు.

"నువ్వు చాలా అందంగా వున్నావు".

తాను హడలిపోయింది.

అప్పటి నుండి కాలేజీకి వెళ్ళిరావటం దినదిన గండంలా మారింది.

అతని క్రూరమైన చూపులు తనను చిత్రవధ చేస్తున్నాయి.

కాలేజీలో స్నేహితులతో చెప్తే పోలీసులకు ఫిర్యాదు చేయమన్నారు.

పోలీసు స్టేషన్‌కి వెళ్ళటం.

తాను ఫిర్యాదు యివ్వటం.

వాళ్లు అతని మీద చర్య తీసుకోవటం

ఇవన్నీ జరిగే పనులుగా కనపడటం లేదు. తాను తలవంచుకుని వచ్చేస్తున్నా అతను పలకరిస్తూనే వున్నాడు.

ఓసారి తనను గురించి చెప్పుకున్నాడు.

"మా నాన్న ఆస్తికంతటికీ నేనే వారసుడిని. నీకు ఈ చదువూ గోలా ఎందుకు? నిన్ను పెళ్ళి చేసుకుంటాను. రాణీలా వుండొచ్చును"

పద్మ బెదిరిపోయింది.

మళ్ళా అతనే అన్నాడు.

"నా గుంపు చాలాపెద్దది. నీ మీద నిఘా పెట్టేను. నా కళ్ళు కప్పి ఏ మగాడితో నైనా స్నేహం చేసావో నేను మనిషిని కాను".

అతని చూపులకు తాను వణికిపోయింది.

అతనే తిరిగి అన్నాడు.

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తున్నావు కదూ"

మొదటిసారిగా నోరువిప్పింది పద్మ.

"మీకు దండం పెడతాను. నా జోలికిరాకండి. నాకు డిగ్రీ చాలా అవసరం. మా పరీక్షలు దగ్గరకు వచ్చాయి. నన్ను వదిలేయండి"

రాజేష్ వికటంగా నవ్వేడు.

"వదిలేయడానికా యిన్నాళ్ళూ వెంటపడింది. కావాలంటే ఈ క్షణంలో నిన్ను ఎత్తుకొనిపోయే సత్తా వుంది. కాని నువ్వు నన్ను ప్రేమించాలి. ప్రేమిస్తావు తప్పదు. మంచి పిల్లవు. ప్రేమిస్తావు కదూ?"

పద్మ నడిరోడ్డని కూడా చూడకుండా బావురుమని ఏడ్చేసింది.

"నా జోలికి రాకండి" వణికిపోతూ అంది.

రాజేష్ చిరాగ్గా అన్నాడు.

''నేనూ ఏమీ చెయ్యనిదే అంత ఏడుపు ఎందుకు? మనిద్దరం కలసి వుండాలి. తప్పదు. నాకు వచ్చే వారం ఈ రోజుకి నీ అంగీకారం చెప్పి తీరాలి''. రాజేష్ విసురుగా వెళ్ళిపోయాడు.

పరీక్షలు దగ్గరకు వచ్చాయి.

ఇంక ఈగోల వదిలి పోతుందనేసరికి రాజేష్ తేదీని కూడా నిర్ణయిం చేసేడు.

అప్పటికి పరీక్షలు వారంలోకి వస్తాయి.

ఎవరితో చెప్పుకోవాలి?

ఇంటిగలాయన పలుకుబడి వున్న ఉద్యోగంలో వున్న వాడు కాబట్టి రాజేష్‌కి ఇంటికి వచ్చే ధైర్యం లేదు.

ఆడపిల్లల కాలేజీ మూలానా కాలేజీ తనకి సుఖంగా వుంటుంది.

కాలేజీకి వెళ్ళటం, రావటమే తన సమస్య.

చదువుకొంటున్నా, మనస్సులో ముల్లులా రాజేష్ విధించిన గడువు దగ్గర పడుతోంది. ఆ సంగతి మర పుకి రావటం లేదు.

తన పరీక్షలూ సమీపిస్తున్నాయి.

తనకు అంగబలం, అర్ధబలం రెండూ లేవు.

రాజేష్ క్రూరత్వానికి తాను బలికాకూడదు. తన సమస్యను తానే పరిష్కరించుకోవాలి.

ఓ వీధిరౌడీ బారి నుండి తనను తానే రక్షించుకో వాలి.

యాసిడ్ అంటూ బెదిరించే ఆ మూర్ఖుడిని ఏదో విధంగా జయించాలి.

పద్మ మనస్సులో మెరుపులా వో ఆలోచన మెరి సింది. నెమ్మదిగా తమ వాటాని ఆనుకొని వున్న పెరటి తలుపు తీసింది.

– చిన్నసందు – రోడ్డుకి ఒక రకంగా డెడ్ ఎండ్! అందరి ఇళ్ళల్లో చెత్తను పోయడానికి తప్ప ఎవరూ ఎక్కువగా ఆ సందుని ఉపయోగించరు.

తన క్లాస్‌మేట్ హసీనా ఇల్లు తమ ఇంటికి నాల్గో యిల్లు – వెళ్ళి తలుపు తట్టింది.

తలుపు తీసిన జుబేదా పద్మని చూసి ఆశ్చర్యప డింది. ''పద్మా! ఇటు వైపు వచ్చావేం'' అంటూ లోప లకు ఆహ్వానించింది.

పద్మని చూసి హసీనా అంది.

''అరె! పద్మ పుస్తకాలను రుబ్బేసే సమయంలో యిటు వచ్చిందే?''

పద్మ కాసేపుండి ''మీ అన్నయ్యతో కొంచెం మాట్లాడాలి'' అంది.

హసీనా ముందు తెల్లబోయినా తరువాత వీధిలో ఎవరితోనో మాట్లాడుతున్న కరీంను పిలుచుకొని వచ్చింది.

పద్మ జుబేదాతో అంది ''ఆంటీ! మీరు కూడా వుండండి''

పద్మ క్లుప్తంగా తాను రాజేష్ వలన ఎదుర్కొంటున్న యిబ్బందులను, తన భయాలనూ వివరించింది.

కరీం అన్నాడు ''నీ ఆలోచనలేమిటి చెప్పు పద్మా''

పద్మ తటపటాయిస్తూ అంది.

''నాకు ఆరు పేపర్లు వుంటాయి. ఆ రోజులన్నీ మీరు నన్ను కాలేజీకి దింపి రావాలి. చూసేవాళ్ళకు మీ చెల్లెలిని దింపుతున్న భావన రావాలి. అందుకు మీరు, హసీనా నాకు సహకరించండి. ఈ డిగ్రీ అయి పోతే అమ్మను నేను సుఖపెట్టగలను''.

జుబేదా అంది '' ఏ విధంగా నిన్ను హసీనా అనుకుంటారు''.

''నేను హసీనా లాగానే బుర్కా వేసుకొంటాను'' అందిపద్మ.

కరీం అన్నాడు. ''సరే! నిన్ను దింపివస్తాను. తిరిగి హసీనాను వచ్చి తీసుకొని వెడతాను. అప్పుడు వాడికి అనుమానం రావచ్చును. వాళ్ళ నాన్న ఇసుక కంట్రాక్టర్. తెగ సంపాదించేసేడు ఈవూరి ఎమ్మెల్యే వీడికి దగ్గర చుట్టం. రాజేష్ గ్యాంగ్ చాలా పెద్దది. చాలా జాగ్రత్తగా మనం ఆలో చించాలి''.

జుబేదా అంది.

''అయ్యో! ఇటువంటి వాడి చేతుల్లో ఎల్లా చిక్కు కున్నావమ్మా!''

పద్మ వెక్కివెక్కి ఏడ్చింది.

''నా మానాన నేను కాలేజీకి వెళ్ళి వస్తాను. అసలు ఇతను ఎవరో కూడా మీరు చెప్పేంతవరకూ నాకు తెలియదు. కొన్ని నెలలుగా నన్ను వేధిస్తున్నాడు. అమ్మ ఏం చేయగలదు? వాడో మూర్ఖుడు. యాసిడ్ నా మీద పోస్తానని భయపెడుతున్నాడు. నేను, అమ్మా ఏమయిపోతాం. నా పరీక్షలు అయిపోతే మేం మా పిన్నిగారింటికి వెళ్ళిపోతాము. నాకా తొందర లోనే వుద్యోగం వచ్చేస్తుంది. ఏదైనా దూరప్రాంతాలకి వేయించు కుంటాను. అమ్మని సుఖపెట్టాలి. నేను నిల బడాలి. అందుకు మీరు నాకు సహకరించాలి''.

హసీనా కరీం వైపు చూసింది.

కరీం అన్నాడు. ''నేను రెండుసార్లు కాలేజీకి వస్తే వాడికి అనుమానం వస్తుంది. ఓ పనిచేస్తాను. నీ పరీ క్షలప్పుడు మా చెల్లిని మా బాబాయి గారింట్లో వదిలే స్తాను. మా అన్నయ్య తనని కాలేజీకి తీసుకొని వెడ తాడు. నీ పరీక్షలకు నేను దింపి, పరీక్ష అయ్యాక తీసు కొని వస్తాను. నీకు డిగ్రీ చాలా అవసరం. మా హసీ నాకు పరీక్షలవగానే పెళ్ళి చేసేస్తాం.

పద్మ కళ్ళు తుడుచుకొని అంది.

''నా చదువేమవుతుందో? నా ఉద్యోగం ఏమవు తుందో అని బెంగ పెట్టుకున్నాను. మా అమ్మని సుఖ పెట్టాలి. ప్రస్తుతం నా లక్ష్యం అదే! మీరంతా సహక రిస్తే నేను ఈ గండం గట్టెక్కుతాను''.

కరీం అన్నాడు. ''బాధపడకు పద్మా! ఓ దుర్మార్గు డిని ఎదుర్కోవటం కంటే తెలివిగా అతని నుండి తప్పిం చుకోవటమే మంచిది. నీకు మా కుటుంబం అంతా అండగా వుంటాం. ఇంక చదువు మీద దృష్టి పెట్టు''.

జుబేదా అంది ''అవునమ్మా! మీరు హాయిగా వుండటానికి నీ చదువు ముఖ్యం. నీ పరీక్షలున్నన్ని రోజులూ మావాడు చెప్పినట్లు చేద్దాం. పరీక్షలప్పుడు నువ్వు పెరటిదోవన వచ్చేసేయి. కరీం నిన్ను కాలేజీకి దింపి వస్తాడు. తిరిగి నిన్ను ఇంటి దగ్గర దింపుతాడు. నువ్వు వెనుకగుండా మీ ఇంటికి వెళ్ళిపోవచ్చును''.

పద్మ మొహం తేటపడింది. అంతవరకూ నిశ్శ బ్దంగా వున్నా హసీనా అంది.


''ఆ రాస్కెల్‌కి నీ రాకపోకలు తెలియకుండా జాగ్రత్త పడదాం. పరీక్షలు వ్రాసేస్తావు. మీరు వూరు విడిచి పెట్టే స్తారు. వీడు ఇక్కడ పిచ్చికుక్కలా తిరుగుతాడు''.

పద్మ పెరటిదోవకుండా యింటికి వచ్చేసింది. తల్లికి అన్నీ వివరంగా చెప్పింది.

అల్లరి పడకుండా పద్మ పరీక్షలు ముగియాలంటే యింతకంటె మంచి ఆలోచన లేదని తల్లి కూడా అంగీ కరించింది.

హాల్ టికెట్ తీసుకునే రోజు వచ్చింది.

పద్మ తల్లి వెళ్ళి ఇంటిగల యజమానిని కలిసింది. పిల్లకు పులకరంగా వుంది. ఎండలో వెళ్ళివస్తే జ్వరం



రావచ్చును. అందుకని డాక్టర్ సర్టిఫికెట్ యిస్తే పద్మ బదులు ఎవరికైనా హాల్ టికెట్ యిస్తారు'' అని వివ రించింది.

రామలక్ష్మి మాటలకు ఆయన అంగీకరించేడు. డాక్టరు సర్టిఫికెట్ తెప్పించి పెట్టాడు.

హసీనా వెళ్ళి పద్మ హాల్ టికెట్ తెచ్చియిచ్చింది.

పరీక్ష రోజున ప్రొద్దుట ఏడు గంటలకు తయార యిపోయింది.

రామలక్ష్మి పెరటి సందుని పరీక్షించి వచ్చింది.

ఎవరూలేరని నిర్ధారించుకొని పద్మని తీసుకొని వెనుకదారి గుండా హసీనా వాళ్ళింటికి వెళ్ళింది.

జుబేదా అంది.

''ఏమనుకోకు పద్మా! ఆ బొట్టుతీసేయి. గాలికి

ముందుభాగం ఎగిరితే బొట్టు కనపడుతుంది. అదే గొడవ''.

రామలక్ష్మి అంది.

''అది వో ప్లాస్టిక్ ముక్క. తీసేసినా ఫరవాలేదు'' అనే సరికి పద్మ తీసేసింది.

పద్మకి బురఖా వేసేరు.

రామలక్ష్మి కాళ్ళకు దండం పెట్టింది పద్మ.


జుబేదా కాళ్ళకు కూడా వంగి దండం పెట్టింది.

''ఛా! ఛా! ఏమిటమ్మా యిదంతా'' అంటూ నొచ్చుకొంది.

లోపలకు వెళ్ళి వో కప్పుతో సేమ్యా పాయసం తెచ్చింది.

''తీపి తిని వెళ్ళు పద్మా! ఫస్ట్ క్లాసులో పాసవుతావు'' అంది జుబేదా

కరీమ్ వెనుకగా స్కూటర్



ఎక్కింది పద్మ.

రామలక్ష్మి వీధిలోనికి రాలేదు.

జుబేదా మాత్రం బయటకు వచ్చి చేతిని వూపింది.

కరీమ్ స్కూటర్‌ని పోనిచ్చేడు.

కాలేజీ దగ్గర్లో ఓ కిళ్ళీ కొట్టు దగ్గర రాజేష్ బృందం కూర్చొని ఉంది.

కరీమ్‌ని పట్టించుకోలేదు వాళ్ళు.

కాలేజీ సమీపిస్తుండగా కరీం నెమ్మదిగా అన్నాడు.

''నువ్వు గబగబా లోపలకు వెళ్ళిపో! దగ్గర్లోనే ఆ గాంగ్ వుంది''

అమ్మాయిలందరూ వారి వారి ఆందోళనల్లో వాళ్ళు వున్నారు.

పుస్తకాలను గబగబా తిరగేస్తున్నారు.

టాయిలెట్‌లోకి వెళ్ళి బురఖా తీసివేసి జాగ్రత్తగా మడతపెట్టి బాగ్‌లో పెట్టేసుకొంది పద్మ.

పరీక్షహాలు దగ్గర హసీనా కనపడింది. పద్మను చూసి సంతోషంగా అంది.

''వచ్చేసేవా?''

పద్మ హాయిగా నవ్వింది.

పరీక్ష అయ్యాక హసీనా అంది.

''నేను తర్వాత వస్తాను. అన్నయ్యతో నువ్వు వెళ్ళిపో'' పద్మ బురఖా వేసుకొని వచ్చింది.

గేటు దగ్గర కరీం సిద్ధంగా వున్నాడు.

వెంటనే స్కూటర్ ఎక్కింది.

కరీం క్రీగంట చూసేడు.

రాజేష్ అసహనంగా అందరినీ పరిశీలనగా చూస్తున్నాడు.

పద్మ హసీనా ఇంటికి వెళ్ళిపోయింది.

కరీం షాపులో పని వుందంటూ వెళ్ళిపోయాడు.

జుబేదా, రామలక్ష్మి ఆదుర్దాగా అడిగేరు.

"అన్నీ సవ్యంగా జరిగేయా?"

పద్మ ఉత్సాహంగా అంది "పేపరు చాలా బాగా చేసేను. ఏ ఆటంకం లేకుండా పరీక్ష అయింది".

రామలక్ష్మి ముందుగా వెనుకదారి పరిశీలించి పద్మను తనతో తీసుకొని వెళ్ళింది.

పద్మ పరీక్షలన్నీ ఏ అవాంతరం లేకుండా సవ్యంగా జరిగేయి.

రాజేష్ మాత్రం క్రోధంతో రగిలిపోయాడు.

ఏమయింది పద్మ?

ఆ పిల్ల తనదనుకున్నాడు. తన స్వంతమనుకున్నాడు.

బెదిరిపోతూ, కన్నీళ్ళతో తనను వేడుకొనే పద్మ ఏమయిపోయింది.

పద్మ కాలేజి అటెండర్ చేతిని తడిపేసరికి సమాచారం వచ్చింది.

పద్మ అన్ని పరీక్షలు పూర్తిగా వ్రాసింది.

తాను, తన మిత్ర బృందం వేయి కళ్ళతో కాపలా కాసేరు.

తమ కళ్ళల్లో కారం కొట్టి అన్ని పరీక్షలూ వ్రాసేసింది.

పద్మ యింటి గలాయిన దగ్గరకు వెళ్ళి వివరాలు అడిగే ధైర్యం లేదు.

ఆయన అసలే ముక్కోపి.

ఓ ఆడపిల్ల గురించి వివరాలు అడిగితే అగ్గిరాముడవుతాడు

తన తండ్రికి చెప్పినా చెప్పవచ్చును.

ముందు పద్మ ఆచూకీ తెలియాలి.

ఆ పిల్లమీద అతనికి వ్యామోహం మరీ పెరిగిపోయింది.

తనకున్న డబ్బు, పలుకుబడి వో పేద పిల్ల ముందు ఓడిపోవటమా? లేదు – లేదు – పద్మ తనకు దక్కాలి – లేదా సర్వనాశనం అవ్వాలి పద్మ.

తనకు కుడిభుజం వంటి కృష్ణారావుతో అన్నాడు.

"ఆ పిల్ల నాకు దక్కాలి. లేదా నేను ఫీల్డులో వుండను. నువ్వు దాని మీద యాసిడ్ 'పోసేయి. నా పేరు అది చెప్పినా నేను ఆ రోజు వూళ్ళో వుండను. నువ్వు ఎవరో కూడా పద్మకి తెలియదు".

కృష్ణారావు అన్నాడు "వదిలెయ్యారా! నువ్వు కో అంటే కోటిమంది వస్తారు. ఆ పిల్లను వదిలేయే".

రాజేష్ కళ్ళు అగ్నిగోళాల్లా మారేయి "పద్మ నాది! నీకు భయమయితే చెప్పు. నేను మరొకరికి పని పురమాయిస్తాను".

కృష్ణారావు నొచ్చుకొని అన్నాడు "నువ్వు నిప్పుల్లో దూకమంటే దూకుతా. నువ్వేం చెప్తే అది చేస్తా. సరేనా?"

పరీక్షలయ్యాక ఇంటర్వ్యూకి రమ్మనమని పద్మకి ఆఫీసు వాళ్ళనుండి కబురువచ్చింది. ఆరోజు కూడా కరీం సహాయం తీసుకొంది పద్మ. అక్కడ ఆఫీసరు అన్నాడు. "ఏజెన్సీ ప్రాంతంలోనే పోస్టులు కాళీగా వున్నాయి. వెడతావా?"

పద్మ సంతోషంగా అంది. "అమ్మ నాతోనే వుంటుంది. నాకు యిబ్బంది ఏమీ లేదు. నేను వెడతాను".

"నీకు ఈ వారంలో ఆర్డర్లు పంపుతాం. మీ నాన్న గారి స్థానంలో నీకు ఈ ఉద్యోగం వచ్చింది. ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం దొరకటం కష్టం. జాగ్రత్తగా చేయి".

పద్మ ఆఫీసర్‌కి నమస్కారం పెట్టి కరీంతో ఇంటికి వచ్చేసింది. జుబేదా చేతులు పట్టుకొని అంది.

"మీ కుటుంబం చేసిన సహాయంతో ఈరోజు పరీక్షలు పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరుతున్నాను. కరీం! ఇదంతా మీ చేతి చలువ. ఓ దుర్మార్గుడి బారి నుండి నన్నూ, నా బ్రతుకునీ రక్షించేరు".

కరీం నవ్వుతూ అన్నాడు.

"మాకు ఆస్తి, అంతస్థూ లేక పోవచ్చును. కాని ఆ రాజేష్ పిచ్చి పట్టినట్లు రోడ్లనీ కలియ తిరుగుతూ వుంటే నాకు ఎంత నవ్వుగా వుందో తెలుసా? పద్మా! ఇంకా కొంచెం కొసమెరుపు ఉంది. మీ ప్రయాణం కూడా సవ్యంగా జరిగేలా జాగ్రత్త పడదాం".

పద్మ వాళ్ళు బయల్దేరే రోజు వచ్చింది.

రామలక్ష్మి ఇంటిగలవాళ్ళతో అంది. "ముందు కొద్దిసామానుతో వెడతాం తరువాత నేను వచ్చి పూర్తిగా యిల్లు ఖాళీ చేస్తాను".

ఇంటిగల వాళ్ళు పద్మ ఉద్యోగంలో చేరుతున్నందుకు చాలా సంతోషించేరు పద్మను సినిమాకు రమ్మన్నారు.

పద్మ కంగారుగా అంది "లేదు. లేదు. నాకు పరీక్షల దిమ్మ తగ్గలేదు. ఎక్కడకూ రాలేను".

కరీం చెప్పినట్లు రామలక్ష్మి ముందుగా స్టేషన్‌కి వెళ్ళి టికెట్స్ తీసుకొంది.

జుబేదాను, హసీనాను కావలించుకొని ఏడ్చింది పద్మ.

"మీ కుటుంబం సహాయం లేకపోతే–"

మాటలను వెక్కిళ్ళు మింగేసాయి. వాళ్ళిద్దరి కళ్ళలోనూ నీరు తిరిగింది.

"హసీనా! నీ గుర్తుగా నీ బురఖా నా దగ్గరే వుంచేసుకొంటాను".

"అయ్యో! అంతేకదా! తప్పకుండా తీసుకో" అంది హసీనా.

బురఖా వేసుకొని కరీంతోపాటు స్కూటర్ ఎక్కింది పద్మ.

రూపెత్తిన క్రౌర్యంలా రాజేష్ కిళ్ళీకొట్టు దగ్గర నిలబడి వున్నాడు.

అతని చూపులు పద్మ ఇంటివైపు అసహనంగా కదులుతున్నాయి.

కరీం పద్మను తీసుకొని వెళ్ళాడు. స్టేషన్ చేరారు.

బురఖా తీయబోయింది పద్మ.

కరీం నెమ్మదిగా వారించేడు.

"రాజేష్ జట్టు లోని వాడు ఎందుకో స్టేషన్‌కి వచ్చేడు. నువ్వు రైలు కదిలే వరకూ యిల్లాగే వుండు. మీ అమ్మగారికి దూరంగా కూర్చో! మన జాగ్రత్తలో మనం వుందాం".

కంపార్టుమెంటులో అతన్ని చూసి ఏదో అనబోయిన రామలక్ష్మిని వారించేడు అతను.

అతను ఇచ్చిన సూచనను అక్షరాలా పాటించేరు తల్లీ, కూతురు. రైలు కదులుతూ వుంటే అతనికి నోటితో కృతజ్ఞతలు చెప్పే ధైర్యం కూడా వారికి లేక పోయింది.

కరీం ఇంటికివస్తూ రాజేష్ ఇంకా కిళ్ళీ కొట్టు దగ్గరే నిలబడి వుండటం చూసి నవ్వుకొన్నాడు. తనలో తాను అనుకొన్నాడు. నువ్వు ఎన్నిరోజులు అక్కడ నిలిచి వున్నా పద్మ నీకు చిక్కదురా! ఇది నీ మీద నా విజయం రా మూర్ఖుడా!"

పదో క్లాసులో రాజేష్ తన క్లాస్‌మేట్!

పబ్లిక్ పరీక్షలలో కాపీ చేస్తూ, తనిఖీ బృందం వచ్చేసరికి ఆ కాగితాలు తనకి అందించేడు – అదో ఉపకారంలా.

బాల్య చాపల్యం కొద్దీ తాను తీసుకొన్న కాగితాలతో తాను డిబార్ అయ్యాడు.

బీద కుటుంబం తమది. తరువాత తండ్రిపోవటం, స్కూటర్ మెకానిక్‌గా జీవితం ప్రారంభం – భుక్తికి లోటులేని సంపాదన – రోజులు గడచి పోతున్నా తనలో ఏదో అసంతృప్తి జ్వాలలా ఎగసిపడుతూ వుండేది. అది యీ రోజుతో చల్లారిపోయింది.

చాలా దినాలకు కరీం ఆరోజు హాయిగా నిద్రపోయాడు.

*

రచయిత్రి సెల్ నెం: **98482 41701**

